# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | మంగళవారం - 28- జూలై 2026 | సంపుటి : 4 | సంచిక : 54 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in


## ఇషా సింగ్ స్వర్ణ విజయం


**మను బాకర్‌కు కాంస్యం**

**షూటర్లకు ముఖ్యమంత్రి అభినందనలు**

**భారత్‌కు డబుల్ పోడియం గౌరవం**

హైదరాబాద్, జూలై 27 (తెలంగాణ ముచ్చట్లు): చైనాలోని హ్యాంగ్‌ఝౌలో జరుగుతున్న అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య ప్రపంచకప్ మహిళల 25 మీటర్ల పిస్టల్ విభాగంలో స్వర్ణ పతకం సాధించిన తెలంగాణ క్రీడాకారిణి ఇషా సింగ్‌కు, కాంస్య పతకం గెలుచుకున్న భారత షూటర్ మను బాకర్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ వేదికపై భారతదేశానికి గౌరవం తీసుకొచ్చిన ఇద్దరు క్రీడాకారిణులను ఆయన ప్రశంసించారు. మహిళల 25 మీటర్ల పిస్టల్ విభాగంలో ఇషా సింగ్ అద్భుత ప్రదర్శన కనబర్చి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోగా, మను బాకర్ కాంస్య పతకాన్ని అందుకున్నారు. ఒకే పోటీలో భారతదేశానికి చెందిన ఇద్దరు షూటర్లు పతకాలు సాధించడం దేశానికి గర్వకారణమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ విజయం భారత షూటింగ్ ప్రతిభను ప్రపంచ వేదికపై మరోసారి చాటిందని అన్నారు.

మిగతా 7లో





## నిరసనలపై ఏకే-47తో కాల్పులు

- బీహార్‌లో కానిస్టేబుల్ సస్పెన్షన్
- విద్యార్థులు గాయపడిన ఘటనపై శాఖ చర్యలు
- ఘటనపై రాజకీయ విమర్శలు వెల్లువ

పాట్నా, జూలై 27 (తెలంగాణ ముచ్చట్లు): బీహార్ బంద్ సందర్భంగా సివాన్ జిల్లాలో జరిగిన కాల్పుల ఘటనపై బీహార్ పోలీసు ప్రధాన కార్యాలయం కఠిన చర్యలు చేపట్టిం ది. నిరసనకారులపై విధుల్లో ఉన్న ఒక పోలీసు కానిస్టేబుల్ తన వద్ద ఉన్న ఏకే47 రైఫిల్‌తో కాల్పులు జరిపినట్లు వచ్చిన ఆరోపణల నే పథ్యంలో అతడిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఘటన రా ష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. జూలై 25న బీహార్ బంద్ సందర్భంగా పలు జిల్లాల్లో విద్యార్థులు భారీ ఎత్తున నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఈ క్రమంలో సివాన్ జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాల్పుల ఘటనలో పలువురు గాయపడగా, ముగ్గురు విద్యార్థులు ప్రస్తుతం పాట్నాలోని జయప్రభ మేదాంత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి ని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు భారీగా మోహరించారు.

ఈ ఘటనలో 15 ఏళ్ల ఆరిఫ్ అనే బాలుడు కూడా బుల్లెట్ గాయాలతో ఆసుపత్రిలో చేరాడు. దుకాణం నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా అతని మెడలో బుల్లెట్ తగిలినట్లు సమాచారం. వైద్యులు అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించి బుల్లెట్‌ను విజయవంతంగా తొ లగించినట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఘటనకు సంబంధిం చిన వీడియోను

మిగతా 2లో

## మతం మారితే ఎస్సీ హోదా రద్దు

**రివ్యూ పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు**

**1950 రాజ్యాంగ ఉత్తర్వులకే మద్దతు**

**రిజర్వేషన్లపై కీలక తీర్పు**

న్యూఢిల్లీ, జూలై 27 (తెలంగాణ ముచ్చట్లు): షెడ్యూల్డ్ కులాలకు చెందిన వ్యక్తి హిందూ, సిక్కు, బౌద్ధ మతాలను విడిచి క్రైస్తవం లేదా ఇతర మతంలోకి మారితే ఎస్సీ హోదా వెంటనే రద్దవుతుందని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. ఈ అంశంపై గతంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పునఃపరిశీలన పిటిషన్‌ను అత్యు న్నత న్యాయస్థానం తిరస్కరించింది. దీంతో హైకోర్టు తీర్పు యథాతథంగా కొనసాగనుం ది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన

మిగతా 2లో



## హైడ్రాపై హైకోర్టు ఆగ్రహం

- కమిషనర్ మార్పునకు ఆదేశాలు
- ఐజీ స్థాయి అధికారిని నియమించాలి
- కోర్టు ధిక్కరణలపై తీవ్ర వ్యాఖ్యలు

హైదరాబాద్, జూలై 27 (తెలంగాణ ముచ్చట్లు): హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వ్యవహారశైలిపై తెలంగాణ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. వరుసగా కోర్టు ధిక్కరణ పిటిషన్లు నమోదవుతున్న నేపథ్యం లో ఆయనను హైడ్రా కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించి, ఆ స్థానంలో ఐజీ స్థాయి అధికారిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. కోర్టు ఉత్తర్వుల అమలులో నిర్లక్ష్యాన్ని సహించబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా లోతుకుంట పరిధి లోని సర్వే నంబర్లు 1, 2లో ఉన్న 40 ఎకరాల భూమికి సంబంధించిన

మిగతా 2లో





## రాజ్యాంగ స్ఫూర్తితోనే పని చేస్తున్నా

- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్
- ప్రభుత్వ ఆస్తులు, చెరువుల పరిరక్షణలో రాజీ లేదు..
- కోర్టు ధిక్కార కేసులను చట్టపరంగానే ఎదుర్కొంటా

2లో

## తాడిచెర్ల-2 ప్రాజెక్టు వేగవంతానికి విజ్ఞప్తి

- కేంద్ర మంత్రులతో కీలక భేటీలు
- స్థానిక యువతకు వెయ్యి ఉద్యోగాల డిమాండ్
- సింగరేణి పెన్షన్ పెంపుపై వినతి

2లో



## ఫోరెన్సిక్ ప్రయోగశాలకు కొత్త బలం

- 57 మంది శాస్త్రాధికారుల నియామకం
- నియామక పత్రాలు అందజేసిన సి.వి. ఆనంద్
- నేర దర్యాప్తు సామర్థ్యానికి మరింత ఊతం



హైదరాబాద్, జూలై 27 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ప్రయోగశాలలో 57 మంది కొత్త శాస్త్రాధికారులు విధుల్లోకి చేరారు. తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ వారి చేతుల మీదుగా వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ నియామకాలతో రాష్ట్ర ఫోరె న్సిక్ విభాగం మరింత బలోపేతం కానుందని అధికారులు తెలిపారు. కొత్తగా నియమితులైన వారిలో 36 మంది పీహెచ్‌డీ పట్టభద్రులు, ఆరుగురు ఎం.టెక్, 12 మంది ఎం.ఎస్సీ, ముగ్గురు ఎంసీఏ విద్యార్హతలు కలిగిన వారు ఉన్నారు. అత్యున్నత విద్యార్హతలు కలిగిన నిపుణులు ఫోరెన్సిక్ విభాగంలో చేరడం వల్ల శాస్త్రీయ దర్యాప్తు మరింత సమర్థవంతంగా సా గుతుందని అధికారులు పేర్కొన్నారు. దేశంలో అత్యుత్తమ ఫోరెన్సిక్ ప్రయోగశాలల్లో ఒకటిగా తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ప్రయోగశాల ఇప్ప టికే గుర్తింపు పొందింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాలు, శాస్త్రీయ విధానాలతో

మిగతా 2లో



## ఓటర్ల నమోదు పూర్తి చేయాలి

- బీఎల్‌ఏలతో భట్టి సమావేశం
- 90 శాతం మ్యాపింగ్ పూర్తి
- వంద శాతం నమోదే లక్ష్యం

మధిర, జూలై 27 (తెలంగాణ ముచ్చట్లు): మధిర నియోజకవర్గంలోని బూత్ స్థాయి ప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో బీఎల్‌ఏల పాత్ర కీలకమని పేర్కొంటూ ప్రతి అర్హుడి ఓటు హక్కు రక్షణకు బాధ్యతాయుతంగా పనిచేయా లని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడటమే ప్రజాస్వామ్యానికి బలమైన పునాదిగా నిలుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో క్షే త్రస్థాయిలో కృషి చేస్తున్న బీఎల్‌ఏలను భట్టి విక్రమార్క అభినందించారు. ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్ల వివరాలను నమోదు చేయడంతో పాటు, ఎలాంటి పొ రపాట్లు జరగకుండా అప్రమత్తంగా వ్యవ హరించాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి అర్హుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకో వాలని కోరారు.

మధిర నియోజకవర్గంలో ఇప్పటికే 90 శాతం ఓటర్ల మ్యాపింగ్ పూర్తయిందని భట్టి విక్రమార్క తెలిపారు. మిగిలిన ప్ర క్రియను కూడా బూత్‌ల వారీగా సమన్వ యంతో వేగంగా పూర్తి చేసి వంద శాతం నమోదును సాధించాలని బీఎల్‌ఏలకు దిశానిర్దేశం చేశారు.

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మతం మారితే ఎస్సీ హోదా రద్దు

(మొదటి పేజీ తరువాయి)

ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. 1950 నాటి రాష్ట్రపతి రాజ్యాంగ ఉత్తర్వుల ప్రకారం హిందూ, సిక్కు, బౌద్ధ మతాలను అనుసరించే షెడ్యూల్డ్ కులాల వారికే ఎస్సీ హోదా వర్తిస్తుందని ధర్మాసనం స్పష్టం చేసింది. మత మార్పిడి జరిగిన వెంటనే ఎస్సీ హోదాతో పాటు దానికి సంబంధించిన రిజర్వేషన్లు, ఇతర ప్రయోజనాలు కూడా అమలులో ఉండవని పేర్కొంది.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పులో ఎలాంటి చట్టపరమైన లోపం లేదని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. అందువల్ల పునఃప రిశీలనకు తగిన కారణాలు కనిపించలేదని పేర్కొంటూ రివ్యూ పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు ఉత్తర్వులను యథాతథంగా కొనసాగిస్తూ ధర్మాసనం తన నిర్ణయాన్ని వెల్లడించింది. మతం మారిన వ్యక్తి తిరిగి ఎస్సీ హోదాను పొందాలంటే రాజ్యాంగం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. పుట్టుకతో షెడ్యూల్డ్ కులానికి చెందినవారై ఉండటం, స్వచ్ఛందంగా తిరిగి తమ అసలు మతంలోకి చేరడం, సంబంధిత మూల కుల సమాజం వారిని తిరిగి ఆమోదించడం వంటి షరతులు నెరవేరినప్పుడే ఎస్సీ హోదా పునరుద్ధరణకు అవకాశం ఉంటుందని వివరించింది.

ఈ తీర్పు మత మార్పిడి, రిజర్వేషన్లకు సంబంధించిన చట్టపరమైన అంశాలపై స్పష్టత ఇచ్చే నిర్ణయంగా న్యాయవర్గాలు భావిస్తున్నాయి. ఎస్సీ హోదా కల్పనకు సంబంధించిన రాజ్యాంగ నిబంధనలను మరోసారి అత్యున్నత న్యాయస్థానం సమర్థించినట్లు విశ్లేషిస్తున్నారు. రిజర్వేషన్ వ్యవస్థ అమలులో ఈ తీర్పు మార్గదర్శకంగా ఉండే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దేశవ్యాప్తంగా మత మార్పిడి, కుల ధ్రువీకరణ పత్రాలు, రిజర్వేషన్లకు సంబంధించిన వివాదాల పరిష్కారంలో ఈ తీర్పు కీలక ప్రాధాన్యం సంతరించుకుంది. భవిష్యత్తులో ఇలాంటి కేసుల విచారణలో కూడా ఈ తీర్పును ప్రామాణికంగా పరిగణించే అవకాశం ఉందని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు.

# హైడ్రాపై హైకోర్టు ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

వ్యవహారం విచారణ సందర్భంగా ఏవీ రంగనాథ్ అఫిడవిట్ దాఖలు చేశారు. సంబంధిత భూమిలో హైడ్రా సిబ్బంది ప్రవేశించలేదని, ఎలాంటి కూల్చివేతలు చేపట్టలేదని అందులో పేర్కొన్నారు. పిటిషనర్ వాస్తవాలను వక్రీకరించి కోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. న్యాయవ్యవస్థపై తమకు అత్యున్నత గౌరవం ఉందని పేర్కొంటూ జరిగిన పరిణామాలకు బేషరతుగా క్షమాపణలు కోరారు.

అయితే కమిషనర్ సమర్పించిన వివరణతో హైకోర్టు సంతృప్తి వ్యక్తం చేయలేదు. ఇప్పటికే ఆయనపై సుమారు 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు నమోదైన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఒకే అధికారిపై ఇంత పెద్ద సంఖ్యలో ధిక్కరణ కేసులు ఎందుకు నమోదవుతున్నాయని ధర్మాసనం ప్రశ్నించింది. కోర్టు మధ్యంతర ఉత్తర్వులను పాటించడంలో విఫలమవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందా అని ప్రభుత్వ తరఫు న్యాయవాదిని నిలదీసింది. న్యాయస్థానాల ఉత్తర్వులను అమలు చేయడం ప్రతి ప్రభుత్వ అధికారికి తప్పనిసరి బాధ్యత అని హైకోర్టు స్పష్టం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం, కోర్టు ఆదేశాలను నిర్లక్ష్యం చేయడం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. ప్రజల హక్కులు, న్యాయవ్యవస్థ గౌరవాన్ని పరిరక్షించే విషయంలో రాజీ పడబోమని ధర్మాసనం స్పష్టం చేసింది.

హైడ్రా కమిషనర్ మార్పుతో పాటు ఐజీ స్థాయి అధికారిని నియమించాలని ఇచ్చిన ఆదేశాలు రాష్ట్ర ప్రభుత్వానికి కీలకంగా మారాయి. ఈ ఆదేశాల అమలుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్న అంశంపై ఆసక్తి నెలకొంది. కోర్టు సూచనల మేరకు పరిపాలనా మార్పులు చేపడుతుందా లేదా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఈ కేసు విచారణలో హైకోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ యంత్రాంగానికి స్పష్టమైన సందేశంగా భావిస్తున్నారు. న్యాయస్థానాల ఆదేశాలను అమలు చేయడంలో జాప్యం లేదా నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని ధర్మాసనం మరోసారి స్పష్టం చేసింది. ప్రభుత్వ అధికారులు చట్టబద్ధమైన విధానాలను అనుసరిస్తూ కోర్టు ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాల్సిన బాధ్యత ఉందని పేర్కొంది.

# రాజ్యాంగ స్ఫూర్తితోనే పని చేస్తున్నా

- -హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్
- -ప్రభుత్వ ఆస్తులు, చెరువుల పరిరక్షణలో రాజీ లేదు..
- -కోర్టు ధిక్కార కేసులను చట్టపరంగానే ఎదుర్కొంటా

**హైదరాబాద్, జులై 27(తెలంగాణ ముచ్చట్లు):**



రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగానే హైడ్రా విధులు నిర్వహిస్తున్నానని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, ఆర్టికల్ 48ఏ ప్రకారం ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, పార్కులను పరిరక్షించడం తమ ప్రధాన బాధ్యతగా భావించి పనిచేస్తున్నట్లు తెలిపారు.

గత రెండేళ్లలో మార్కెట్ విలువ సుమారు రూ.1.50 లక్షల కోట్లుగా అంచనా వేయబడిన ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, పార్కులు, వేల ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి స్వాధీనం చేసుకుని ప్రభుత్వానికి అప్పగించినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు ఆరు చెరువులను పూర్తిస్థాయిలో పునరుద్ధరించగా, మరో 20 చెరువుల పునరుద్ధరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు.

భూ మాఫియా, భూ ఆక్రమణదారులు తప్పుడు సమాచారం అందించి న్యాయస్థానాలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని రంగనాథ్ ఆరోపించారు. లోతుకుంట భూముల వ్యవహారంలో సుమారు రూ.10 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరిగాయని తెలిపారు. అనుమతులు లేకుండా హెరిటేజ్ గుట్టలను పేల్చివేయడం, వందలాది చెట్లను నరికివేయడం వంటి చర్యలపై స్థానికులు, పర్యావరణవేత్తలు, సేవ్ ది రాక్స్ సొసైటీ ఫిర్యాదుల మేరకు హైడ్రా చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు.

ప్రస్తుతం తనపై 63 కోర్టు ధిక్కార కేసులు ఉన్నాయని, అవన్నీ భూ ఆక్రమణలను అడ్డుకోవడమే కారణమని రంగనాథ్ తెలిపారు. బతుకమ్మ కుంట చెరువు, లోతుకుంట ప్రభుత్వ భూములు, సామాన్యుల ప్లాట్లు, సింగరేణి కార్మికుల స్థలాలను కాపాడే క్రమంలో పలువురు భూ ఆక్రమణదారులు తనపై కోర్టు ధిక్కార కేసులు దాఖలు చేశారని ఆరోపించారు.తనకు న్యాయస్థానాలపై పూర్తి విశ్వాసం ఉందని, అన్ని కేసులను చట్టపరంగానే ఎదుర్కొంటానని స్పష్టం చేశారు. గతంలోనూ, ప్రస్తుతం కూడా, భవిష్యత్తులో ప్రభుత్వం ఏ బాధ్యతలు అప్పగించినా రాజ్యాంగం, చట్టాల పరిధిలోనే వంద శాతం ఫలితాలు సాధించే లక్ష్యంతో నిబద్ధతతో పనిచేస్తానని ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు.

# ఫోరెన్సిక్ ప్రయోగశాలకు కొత్త బలం

(మొదటి పేజీ తరువాయి)

నేర పరిశోధనలకు అవసరమైన సేవలను అందిస్తూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది.

గత ఏడాది ప్రయోగశాలలో 19,671 కేసులను పరిశీలించగా, వాటిలో 86 శాతం కేసులను పరిష్కరించినట్లు అధికారులు వెల్లడించారు. జాతీయ ప్రమాణాల గుర్తింపు పొందిన ఈ ప్రయోగశాల సమాచార సాంకేతిక చట్టంలోని నిబంధనల ప్రకారం కూడా అధికారిక గుర్తింపును కలిగి ఉంది. ఫోరెన్సిక్ రంగంలో నైపుణ్యం కలిగిన మానవ వనరులను పెంపొందించడం ద్వారా నేర దర్యాప్తు వేగవంతం కావడంతో పాటు శాస్త్రీయ ఆధారాలతో కేసుల విచారణ మరింత బలపడుతుందని అధికారులు తెలిపారు. ప్రజలకు సత్వర న్యాయం అందించడంలో ఫోరెన్సిక్ సేవలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతిక వసతులు, నిపుణుల సేవలు, విస్తృత మౌలిక సదుపాయాలతో తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ప్రయోగశాల తన సేవలను మరింత విస్తరించేందుకు సిద్ధమవుతోంది. కొత్తగా చేరిన శాస్త్రాధికారుల సేవలతో ఫోరెన్సిక్ విశ్లేషణ మరింత వేగవంతం కావడంతో పాటు నేరాల దర్యాప్తులో నాణ్యత మరింత పెరుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.






## నిరసనలపై

# ఏకే-47తో కాల్పులు

(మొదటి పేజీ తరువాయి)

బీహార్ ప్రతిపక్ష నేత తేజస్వి యాదవ్ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఈ వీడియో వైరల్ కావడంతో ఘటనపై దేశవ్యాప్తంగా చర్చ ప్రారంభమైంది. కాల్పుల వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కూడా ఈ ఘటనపై స్పందించారు. ఢిల్లీలో విద్యార్థులపై పెల్లెట్ గన్లను ఉపయోగించారని, బీహార్‌లో ఏకే47 రైఫిల్‌తో కాల్పులు జరిగినట్లు ఆరోపిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును విమర్శించారు. విద్యార్థులపై బలప్రయోగం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని బీహార్ పోలీసులు తెలిపారు. కాల్పులకు దారితీసిన పరిస్థితులు, విధి నిర్వహణలో జరిగిన చర్యలపై సమగ్ర విచారణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. విచారణ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు స్పష్టం చేశారు.

# తాడిచెర్ల-2 ప్రాజెక్టు వేగవంతానికి విజ్ఞప్తి

**న్యూఢిల్లీ, జూలై 27 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ కేంద్ర మంత్రులతో సమావేశమయ్యారు. ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, గనుల రంగ విస్తరణ, కార్మిక సంక్షేమం వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వ సహకారం కోరుతూ పలు వినతిపత్రాలను సమర్పించారు. మొదట కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయను కలిసి తెలంగాణలో కార్మిక సంక్షేమ కార్యక్రమాల విస్తరణ, ఉపాధి అవకాశాల పెంపు, కేంద్ర పథకాల సమర్థ అమలుకు అదనపు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించే చర్యలకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరారు.



అనంతరం కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత శాఖ మంత్రి జయంత్ చౌదరిని కలిసి యువతకు అత్యాధునిక నైపుణ్య శిక్షణ, ఆధునిక సాంకేతిక శిక్షణ కేంద్రాల ఏర్పాటు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ కార్యక్రమాల విస్తరణపై చర్చించారు. మారుతున్న ఉపాధి అవసరాలకు అనుగుణంగా శిక్షణా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిని కలిసి పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి కీలకమైన తాడిచెర్ల-2 బొగ్గు గని ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల యువతకు ప్రాధాన్యం ఇస్తూ కనీసం వెయ్యి ఉద్యోగాలు కల్పించాలని, నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం, పునరుద్ధరణ ప్యాకేజీని సమర్థంగా అమలు చేయాలని కోరారు.

సింగరేణి సంస్థ నుంచి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు కనీసం నెలకు రూ.10 వేల పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని కూడా కేంద్రాన్ని కోరారు. సింగరేణి విస్తరణ, కొత్త బొగ్గు గనుల అభివృద్ధి, గనుల ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని కేంద్ర మంత్రులు హామీ ఇచ్చినట్లు డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి తెలిపారు. తాడిచెర్ల-2 ప్రాజెక్టు వేగవంతం, స్థానిక యువతకు ఉద్యోగాలు, నిర్వాసితులకు పునరావాసం, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ పెంపు వంటి అంశాలపై సంబంధిత శాఖలతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రులు పేర్కొన్నట్లు వెల్లడించారు.

# ఓటర్ల నమోదు పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)



ప్రతి బూత్‌లో నమోదుకు మిగిలిన ఓటర్లను గుర్తించి ప్రక్రియను త్వరితగతిన ముగించాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత, కచ్చితత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అన్నారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించాలని బీఎల్‌ఏలకు సూచించారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేస్తున్న ప్రతి బీఎల్‌ఏకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భట్టి విక్రమార్క తెలిపారు. బీఎల్‌ఏలకు సహకరిస్తున్న వారి కుటుంబ సభ్యుల సేవలను కూడా ఆయన అభినందించారు. వారి సహకారంతోనే క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. బీఎల్‌ఏల కుటుంబాల సంక్షేమంపై కూడా పార్టీ ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని భట్టి విక్రమార్క తెలిపారు. వారి పిల్లల విద్య, ఉద్యోగ అవకాశాల విషయంలో అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# బ్యాంక్ ఆఫ్ బరోడా డేటా లీక్ వార్తలు..

- బ్యాంక్ నుంచి అధికారిక ప్రకటన కోసం ఎదురుచూపులు

**న్యూఢిల్లీ, జూలై 27, తెలంగాణ ముచ్చట్లు:**

ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన బ్యాంక్ ఆఫ్ బరోడాకు చెందిన సున్నితమైన డేటా హ్యాకింగ్‌కు గురైనట్లు మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. వ్యక్తిగత, కార్పొరేట్ బ్యాంకింగ్ సేవలకు సంబంధించిన సమాచారం, వినియోగదారుల వ్యక్తిగత వివరాలు, నెట్ బ్యాంకింగ్ డేటా హ్యాకర్ల చేతికి చిక్కినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ అంశంపై బ్యాంక్ ఆఫ్ బరోడా నుంచి అధికారిక ధృవీకరణ ఇంకా వెలువడలేదు.

మీడియా కథనాల ప్రకారం దేశవ్యాప్తంగా ఉన్న పలు బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖలకు సంబంధించిన కీలక సమాచారం లీక్ అయినట్లు తెలుస్తోంది. ఇందులో ఖాతాదారుల పేర్లు, ఆధార్ వివరాలు, సేవింగ్స్, కరెంట్ ఖాతాల రికార్డులు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

అలాగే కస్టమర్ల రుణాలకు సంబంధించిన డేటా, లోన్ అప్లికేషన్ ఫారాలు, అప్రైజల్ డాక్యుమెంట్లు కూడా లీకైన జాబితాలో ఉన్నాయని కథనాలు పేర్కొంటున్నాయి. నెట్ బ్యాంకింగ్ యూజర్ వివరాలు, ఎన్‌ఆర్‌ఐ సేవల సమాచారం, కార్పొరేట్ బ్యాంకింగ్ రికార్డులు కూడా హ్యాకర్ల చేతికి చిక్కినట్లు సమాచారం.

అంతేకాకుండా బ్రాంచ్ ఆడిట్ నివేదికలు, యాప్‌కు సంబంధించిన ఆడిట్ వివరాలు, విజిలెన్స్ విచారణలకు సంబంధించిన పత్రాలు, అంతర్గత కమ్యూనికేషన్లు, కస్టమర్ సపోర్ట్ డేటా, బ్రాంచ్‌లు, ఏటీఎంలకు సంబంధించిన కొన్ని కీలక వివరాలు కూడా లీకైనట్లు ప్రచారం జరుగుతోంది.

ఈ వార్తలపై బ్యాంక్ ఆఫ్ బరోడా లేదా సంబంధిత ప్రభుత్వ సంస్థల నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. అప్పటి వరకు సోషల్ మీడియాలో వస్తున్న సమాచారాన్ని పూర్తిగా నిజమని భావించకుండా, అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని నిపుణులు సూచిస్తున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# గ్రామ స్థాయి నుంచి పార్టీ విస్తరణకు కార్యాచరణ



**ఎల్కతుర్తి , జూలై 27 (తెలంగాణ ముచ్చట్లు):** భారతీయ జనతా పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఎల్కతుర్తి మండలంలో ఎస్ఐఆర్ ప్రవాస్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు శ్రీ కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మండల సంయోజక్‌గా హాజరై మండల పదాధికారులు, మోర్చాల అధ్యక్షులు, శక్తికేంద్ర ఇన్‌చార్జిలతో సమావేశమయ్యారు.
పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయాలంటే గ్రామ, బూత్ స్థాయిలో కార్యకర్తలు చురుకుగా పనిచేయాలని ఆయన సూచించారు. మండలంలోని పలు గ్రామాల బూత్ కమిటీల పనితీరును సమీక్షించి, పార్టీ విస్తరణకు చేపట్టాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ప్రతి బూత్‌లో పార్టీ బలోపేతమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇటీవల నూతనంగా ఎన్నికైన మండల పదాధికారులను ఘనంగా సన్మానించి, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ సమావేశానికి బీజేపీ ఎల్కతుర్తి మండల అధ్యక్షులు శ్రీ మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ అధ్యక్షత వహించగా, మండల పదాధికారులు, మోర్చాల అధ్యక్షులు, శక్తికేంద్ర ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం, విద్యా సంక్షేమమే లక్ష్యం

- **సాతూరి వెంకన్న మాదిగ**



**ఎల్కతుర్తి, జూలై 27 (తెలంగాణ ముచ్చట్లు):** మాదిగ జాతి అభ్యున్నతి, సామాజిక న్యాయం, విద్యా సంక్షేమమే తన ప్రధాన లక్ష్యాలని ఎమ్మార్పీఎస్ నూతన జాతీయ ఉపాధ్యక్షులు సాతూరి వెంకన్న మాదిగ అన్నారు. హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మేడి పాపయ్య మాదిగ అధ్యక్షతన జరిగిన జాతీయ కమిటీ ముఖ్య నాయకుల సమావేశంలో హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామానికి చెందిన సాతూరి వెంకన్న మాదిగను జాతీయ ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా నియమించారు. ఈ సమావేశానికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
నియామకం అనంతరం సాతూరి వెంకన్న మాదిగ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి జాతీయ ఉపాధ్యక్షుడి బాధ్యతలు అప్పగించిన ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మేడి పాపయ్య మాదిగ, రాష్ట్ర అధ్యక్షులు కేదాసి మోహన్ మాదిగతో పాటు సంస్థ నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.
మాదిగ జాతి హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం సాధన, విద్యా అవకాశాల విస్తరణ, యువత సాధికారత, సంక్షేమ కార్యక్రమాల బలోపేతం కోసం దేశవ్యాప్తంగా అంకితభావంతో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. జాతి అభ్యున్నతే ధ్యేయంగా ప్రతి కార్యకర్తతో కలిసి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తానని స్పష్టం చేశారు. ఆయన నియామకంపై ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# విద్యార్థుల దాహార్తి తీర్చిన రామ్‌కీ ఫౌండేషన్



**పెద్దమందడి,జూలై27(తెలంగాణ ముచ్చట్లు):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమానికి చేయూతనందిస్తూ రామ్‌కీ ఫౌండేషన్ మరో సేవా కార్యక్రమాన్ని చేపట్టింది. పెద్దమందడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న సుమారు 350 మంది విద్యార్థినీ, విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండేలా ఆర్.ఓ. మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి పాఠశాలకు అందజేసింది.గ్రామానికి చెందిన ప్రసన్న కుమార్ రెడ్డి చొరవతో ఈ ఆర్.ఓ. ప్లాంట్ ఏర్పాటు కావడంతో విద్యార్థులకు నాణ్యమైన, సురక్షితమైన తాగునీరు అందుబాటులోకి వచ్చింది. ఈ సౌకర్యం ద్వారా విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఎంతో మేలు చేకూరనుందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతన్న మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సేవా సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. విద్యార్థుల అవసరాన్ని గుర్తించి ఆర్.ఓ. ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన రామ్‌కీ ఫౌండేషన్‌కు, అలాగే ఈ కార్యక్రమం అమలుకు ప్రత్యేక చొరవ చూపిన ప్రసన్న కుమార్ రెడ్డి కి పాఠశాల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# పెద్దమందడి రైతు వేదికలో విత్తన మేళా ప్రారంభం

**పెద్దమందడి,జూలై27(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండల రైతులకు నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై అందుబాటులోకి తీసుకురావడానికి పెద్దమందడి రైతు వేదికలో సోమవారం (జూలై 27) నుంచి బుధవారం (జూలై 29) వరకు మూడు రోజుల పాటు విత్తన మేళా నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి సైదులు యాదవ్ తెలిపారు.ఈ విత్తన మేళాలో కందులు, జొన్నలు, మినుముల విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన విత్తనాలను పొందాలని సూచించారు.మండలంలోని రైతులందరూ నిర్ణీత తేదీల్లో పెద్దమందడి రైతు వేదికను సందర్శించి సబ్సిడీ విత్తనాలను పొందాలని మండల వ్యవసాయ అధికారి విజ్ఞప్తి చేశారు.



# అర్చక కుటుంబానికి ఆర్థిక చేయూత

**ఖమ్మం బ్యూరో, జులై 27(తెలంగాణ ముచ్చట్లు ):** ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం బుచ్చిరెడ్డిపాలెం గ్రామం లోని ఎస్ టి కె వెంకటేశ్వర్లు భార్య ఐదు రోజుల క్రితం ఆడ శిశువుకు జన్మనిచ్చిది అట్టి నవ జాత శిశువును అత్యవసర చికిత్స నిమిత్త మై విజయవాడ లోని అనువై బేబీ కేర్ సెంటర్ నందు చేర్పించడం జరిగినది వైద్యానికి అవసరం అయ్యే ధన సహాయం కొరకు మండల డి డి యన్ అధ్యక్షుడు ఆయన కొత్తూరు రాజేష్ శర్మను అలాగే అర్చకులు కాశవజ్జల నరసింహమూర్తి ని అభ్యర్థించగా వారు జిల్లా సంఘానికి సమాచారం



చేరవేశారు జిల్లా సంఘం అభ్యర్థనను మన్నించి జిల్లాలోని అర్చకులు అందరి ద్వారా 81వేల రూపాయలు సేకరించి అర్చకునికి ఆర్థిక సహాయం అందించారు ఈ కార్యక్రమం లో ఖమ్మం జిల్లా డి డి యన్ అర్చక సంఘం అధ్యక్షులు మునగలేటి రమేష్ శర్మ కార్యదర్శి మరింగంటి భార్గవా చార్యులు రాష్ట్ర డి డి యన్ అర్చక సంక్షేమ సంఘం అధ్యక్షులు అన్నావజ్జల ప్రసాద్ శర్మ నేలకొండపల్లి మండల అధ్యక్షులు చిలుకూరు నాగమూర్తి అర్చకులు కె చంద్రశేఖర శర్మ పాల్గొన్నారు ఈ సందర్భంలో ఎస్ టి కె వెంకటేశ్వర్లు అత్యవసర సమయంలో నా కుటుంబానికి అండగా నిలబడి ఆర్థిక సహాయం అందించిన జిల్లా దూప దీప నైవేద్య అర్చక సంఘానికి జిల్లాలోని డి డి యన్ అర్చకులకు ఋణపడి ఉంటానని ప్రకటిస్తూ అందరికి ధన్యవాదములు తెలియజేశారు

# పర్యాటక రంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- **ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి లోక్ సభలో అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చిన కేంద్ర మంత్రి**

**ఖమ్మం బ్యూరో, జులై 27(తెలంగాణ ముచ్చట్లు ):** దేశ పర్యాటక ప్రాంతాల్లో అభివృద్ధిని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపడుతోందని.. ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి సోమవారం లోక్ సభలో ప్రశ్నించారు. దేశంలోని ప్రధాన పర్యాటక ప్రాంతాలైన హిల్ స్టేషన్లు, తీర ప్రాంతాలు, పుణ్యక్షేత్రాలపై ఎలాంటి దృష్టి పెట్టారో వివరాలు తెలపాల్సిందిగా కోరారు. దీనికి కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. మౌలిక సదుపాయాల కల్పన, నీటి కొ రత వంటి సమస్యల నివారణ బాధ్యత ప్రధానంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల యంత్రాంగాలదేనని మంత్రి స్పష్టం చేశారు. ప్రాజెక్టు ప్రతిపాదనలు సమర్పించే సమయంలో పర్యాటక ప్రాంతాల సామర్థ్యాన్ని అంచనా వేయాలని, రాష్ట్రాలను కేంద్రం ప్రోత్సహిస్తోందని, దీనికోసం ప్రత్యేక మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసినట్లు తెలిపారు.
హోటళ్లకు పర్యావరణ మార్గదర్శకాలు
స్వచ్ఛంద వర్గీకరణ పథకం కింద 1 నుండి 5స్టార్ హోటళ్లు మురుగునీటి శుద్ధి మొక్కలు (స్టప్ ), వర్షపు నీటి సేకరణ, వ్యర్థాల నిర్వహణ, వాయునీటి కాలుష్య నివారణ వంటి పర్యావరణహిత పద్ధతులు పాటించేలా మార్గదర్శకాలు జారీ చేశామని పేర్కొన్నారు.
పర్యావరణ బాధ్యతను పెంపొందించడానికి 'ట్రావెల్ ఫర్ లైఫ్' కార్యక్రమం
పర్యాటక వ్యాపార రంగంలో పర్యావరణ బాధ్యతను పెంపొందించడానికి 'ట్రావెల్ ఫర్ లైఫ్' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు మంత్రి వెల్లడించారు. తక్కువ ప్రసిద్ధి చెందిన ప్రాంతాలపై అవగాహన కల్పించేందుకు 'దేఖో అప్నా దేశ్' చొరవను క్రియాశీలకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. స్వదేశ్ దర్శన్, స్వదేశ్ దర్శన్ 2.0, సీబీడీడీ, ప్రసాద్ వంటి



ప్రతిష్టాత్మక పథకాల ద్వారా పర్యాటక ప్రాంతాల్లో మౌలిక వసతులు, భద్రత, పారిశుద్ధ్యం మెరుగుపరచడానికి కేంద్రం ఆర్థిక సహాయం అందిస్తోందని మంత్రి వివరించారు.

# విధులు నిర్వర్తిస్తున్నా వేతనాలు అందడం లేదంటూ ఆవేదన

**ఎల్కతుర్తి జులై 27(తెలంగాణ ముచ్చట్లు):** గత మూడు నెలలుగా విధులు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నప్పటికీ వేతనాలు అందడం లేదని వీవీబీజీ రామ్‌జీ క్షేత్ర సహాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ సోమవారం మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) విజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా క్షేత్ర సహాయకుల సంఘం మండల అధ్యక్షుడు ఎదురుగట్ల రాజేష్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో అప్పగించిన బాధ్యతలను ఎలాంటి నిర్లక్ష్యం



లేకుండా నిర్వర్తిస్తున్నప్పటికీ మూడు నెలలుగా వేతనాలు అందక ఉద్యోగులు, వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. నిత్యావసర ఖర్చులు, పిల్లల విద్య, వైద్య అవసరాలు తీర్చుకోవడం కూడా కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.
వినతిపత్రాన్ని స్వీకరించిన ఎంపీడీవో విజయ్ కుమార్ సమస్యను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వేతనాల విడుదలకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఏపీవో అనిత, క్షేత్ర సహాయకులు కిరణ్, సంపత్, రాజయ్య, సంతోష్, స్వరూప, చంద్రకళ, సదానందం, దాసకిరణ్, కొమరయ్య, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# కీశే గడ్డం లక్ష్మికి బీసీ జేఏసీ నాయకుల ఘన నివాళి

- **కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం**

**హుజురాబాద్, జూలై 27(తెలంగాణ ముచ్చట్లు ):** కొత్తకొండ ధర్మారం గ్రామానికి చెందిన కీశే గడ్డం లక్ష్మి మృతి పట్ల హుజురాబాద్ బీసీ జేఏసీ నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ నెల 23న బిందెవరపల్లి గ్రామంలో పరమపదించిన గడ్డం లక్ష్మికి ఘనంగా నివాళులర్పించి, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు.
హుజురాబాద్ పట్టణానికి చెందిన కెఆర్ టైలర్ బిక్షపతి సతీమణి శ్రీలత తల్లిగారైన గడ్డం లక్ష్మి మృతి వార్త తెలుసుకున్న బీసీ జేఏసీ నాయకులు ఆమె కుమారులు గడ్డం మోహన్, సత్యం, బాలకృష్ణ, హరికృష్ణలను



కలిసి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా గడ్డం లక్ష్మి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని కోరారు.
ఈ సందర్భంగా బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్, అధ్యక్షులు సందేల వెంకన్న మాట్లాడుతూ, గడ్డం లక్ష్మి-రాజమౌళి దంపతులు గ్రామంలో మంచితనానికి, సేవాభావానికి ప్రతీకలుగా నిలిచారని కొనియాడారు. వారి ఆదర్శ జీవితం గ్రామ ప్రజలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్, అధ్యక్షులు సందేల వెంకన్న, ప్రధాన కార్యదర్శి ఇప్పకాయల సాగర్, రాష్ట్ర పద్మశాలి సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ సంగెం సత్యనారాయణ, ఇప్పలపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించి నివాళులర్పించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: పొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## శాంతిభద్రతలు గాడితప్పాయి: కౌశిక్



- చర్యలు లేకుంటే భారీ ధర్నా

**హుజురాబాద్, జులై 27(తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లాలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, పోలీసింగ్ వ్యవస్థ వైఫల్యంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆరోపించారు. జిల్లాలో వరుసగా జరుగుతున్న దొంగతనాలు, హత్యాయత్నాలు, కాల్పుల ఘటనలు ప్రజల భద్రతపై తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు.

పీఎంజె జ్యూవెలర్స్ కాల్పుల ఘటన, అల్గునూర్ చౌరస్తాలో ప్రముఖ న్యాయవాదిపై హత్యాయత్నం, కరీంనగర్ పట్టణంలో భారీ చోరీ, హుజురాబాద్‌లో ఇటీవల జరిగిన హత్య కేసు, వరుస బైక్ దొంగతనాలు పోలీసుల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని ఆయన విమర్శించారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ పనితీరుపై తాను అసెంబ్లీ వేదికగా ముందే హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని అన్నారు.

ఇటీవల చోటుచేసుకున్న ఘటనలకు నైతిక బాధ్యత వహిస్తూ కరీంనగర్ సీపీపై వెంటనే చర్యలు తీసుకోవాలని, అలాగే పీఎంజె జ్యూవెలర్స్ కాల్పుల కేసులో నిందితుల వివరాలను ప్రజలకు వెల్లడించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్ నాయకత్వంలో వారం రోజుల్లోపు కరీంనగర్ సీపీ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

జిల్లా ప్రజల ప్రాణ, ఆస్తి భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని పాడి కౌశిక్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## వర్షాభావ హెచ్చరిక.. రైతులకు అప్రమత్తం!



- జమ్మికుంట రైతువేదికలో మూడు రోజుల పాటు విత్తనాల పంపిణీ
- ఆరుతడి పంటల సాగుపై వ్యవసాయ శాఖ సూచన

**జమ్మికుంట టౌన్ జూలై 27 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు పంటల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి షేక్ ఖాదర్ హుస్సేన్ సూచించారు. వర్షాలపై పూర్తిగా ఆధారపడే పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని రైతులకు పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూలై 27 నుంచి 29వ తేదీ వరకు జమ్మికుంట రైతువేదికలో కంది, పెసర, మొక్కజొన్న, నువ్వులు, కూరగాయల విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అవసరమైన రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రభుత్వ ఆధ్వర్యంలో అందిస్తున్న నాణ్యమైన విత్తనాలను పొందాలని సూచించారు.

అలాగే, వాతావరణ పరిస్థితుల్లో చోటు చేసుకుంటున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం విడుదల చేసే వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనించాలని, వాటికి అనుగుణంగా వ్యవసాయ పనులను చేపట్టాలని రైతులకు సూచించారు. విత్తనాలు, పంటల సాగు, ఇతర సాంకేతిక సూచనల కోసం సమీప వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని కోరారు.

వ్యవసాయ శాఖ సూచనలను పాటించడం ద్వారా వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొని పంట నష్టాలను తగ్గించుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి షేక్ ఖాదర్ హుస్సేన్ పేర్కొన్నారు.

## ఉద్యమకారుల హక్కుల కోసం మరో పోరాటం

- సీఎం రేవంత్‌ను కలవనున్న టీయూఎఫ్



**జమ్మికుంట టౌన్ జూలై 27 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధన కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ (టీయూఎఫ్) రాష్ట్ర సెక్రటరీ జనరల్, జిల్లా అధ్యక్షుడు ఎక్కటి సంజీవరెడ్డి అన్నారు. జమ్మికుంట పట్టణంలో టీయూఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

రాష్ట్ర అధ్యక్షుడు డా. చీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఉద్యమకారుల గుర్తింపు కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కే.కే. కమిటీ ఈ నెల 8 నుంచి 22 వరకు వివిధ జిల్లాల్లో ఉద్యమకారులు, విద్యార్థి, ప్రజా, కార్మిక సంఘాల జేఏసీ ప్రతినిధులతో విస్తృతంగా సమావేశాలు నిర్వహించిందన్నారు.

ఈ నెల 20న కే.కే. కమిటీకి ఫోరమ్ తరఫున కీలక డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులను అధికారికంగా గుర్తించి గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు జారీ చేయడంతో పాటు 250 గజాల ఇంటి స్థలాలు కేటాయించాలని కోరినట్లు చెప్పారు. జార్ఖండ్ రాష్ట్రంలో అమలవుతున్న తరహాలో తెలంగాణ ఉద్యమకారులకు ప్రత్యేక సంక్షేమ విధానాన్ని అమలు చేయాలని, ఉద్యమంలో ప్రాణత్యాగాలు చేసినవారికి, జైలు శిక్షలు అనుభవించిన ఉద్యమకారులకు తగిన గౌరవం, సంక్షేమం కల్పించేలా ముఖ్యమంత్రి కే.కే. కమిటీకి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఉద్యమకారుల సమస్యలపై నేరుగా వినతిపత్రం అందజేస్తామని వెల్లడించారు.

ఈ సమావేశంలో హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆరే రమేష్ రెడ్డి, రచ్చ గణేష్, పతకాల ఓదెలు, కొంగరి రవీందర్, బిట్ల రమేష్, మంకాలి రమ తదితర ఉద్యమకారులు పాల్గొన్నారు.






## ప్రభుత్వ పాఠశాలలకు వాటర్ ప్యూరీఫైర్లు

- విద్యార్థుల సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**హుజూరాబాద్,జులై 27(తెలంగాణ ముచ్చట్లు):**హుజూరాబాద్ నియోజకవర్గంలో విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జయన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆధునిక వాటర్ ప్యూరీఫైర్లను హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం రాజపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి వాటర్ ప్లాంట్‌ను ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా కాట్రపల్లి, కందుగుల, పెద్దపాపయ్యపల్లి, హుజూరాబాద్ బాలుర, హుజూరాబాద్ బాలికల, సింగాపూర్, సిర్సపల్లి, చెల్పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరీఫైర్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సదుపాయం ద్వారా వేలాది మంది విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులే దేశ భవిష్యత్తని, వారికి నాణ్యమైన విద్యతో పాటు స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన మౌలిక వసతులు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. అలాగే చెల్పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను దత్తత తీసుకుని దశలవారీగా అన్ని మౌలిక వసతులతో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. తరగతి గదులు, తాగునీటి సౌకర్యం, పారిశుధ్యం తదితర సదుపాయాల కల్పనకు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, గందె శ్రీనివాస్, తిరుమల్, ముత్యం రాజు, సర్పంచ్ మల్లారెడ్డి, రాజు, జయన్న ఫౌండేషన్ ప్రతినిధులు గుడిపాటి సరిత, జైపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మున్సిపల్ సిబ్బందికి ఈపీఎఫ్‌పై అవగాహన..

- కుటుంబ భద్రతకు నామినేషన్ తప్పనిసరి
- రూ. 7 లక్షల వరకు బీమా, పెన్షన్ సహా పలు ప్రయోజనాలు – జమ్మికుంటలో ప్రత్యేక సదస్సు



**జమ్మికుంట టౌన్ జూలై 27 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, వాటర్ సప్లై సిబ్బంది, కార్యాలయ ఉద్యోగులకు సోమవారం ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్)పై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఈపీఎఫ్ పథకం ద్వారా ఉద్యోగులకు లభించే ప్రయోజనాలను వివరించి, ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా నామినేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు. అధికారులు మాట్లాడుతూ, ఉద్యోగి వేతనం నుంచి 12 శాతం, మున్సిపాలిటీ యాజమాన్యం నుంచి మరో 12 శాతం చొప్పున ఈపీఎఫ్ ఖాతాలో జమ అవుతుందని తెలిపారు. ఈపీఎఫ్ సభ్యుడు అనుకోకుండా మరణించిన పక్షంలో నామినీకి రూ.2.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు బీమా ప్రయోజనం అందే అవకాశం ఉంటుందని వెల్లడించారు. అదేవిధంగా అర్హత మేరకు జీవిత భాగస్వామికి పెన్షన్, పిల్లల విద్యకు ఆర్థిక సహాయం కూడా లభిస్తుందని వివరించారు. కుటుంబ సభ్యులకు భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రతి కార్మికుడు ఈపీఎఫ్ నామినేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేసి, నామినీ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ సూపరింటెండెంట్ మాజేటి రమేష్, సీనియర్ అసిస్టెంట్ జి. అనిల్, మున్సిపల్ మేనేజర్ జి. రాజిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఐ. రమేష్‌తో పాటు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, వాటర్ సప్లై సిబ్బంది, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.




## శ్రీ మడేలేశ్వరస్వామి బోనాలకి మున్సిపల్ చైర్మన్‌కు ఆహ్వానం

- రజక సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా ఆహ్వాన పత్రిక అందజేత

**జమ్మికుంట టౌన్ జూలై 27 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలో ఈ నెల 31వ తేదీ ఉదయం 9 గంటలకు అత్యంత వైభవంగా నిర్వహించనున్న శ్రీ మడేలేశ్వరస్వామి వారి బోనాల మహోత్సవాలకు విచ్చేసి స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరుతూ మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్కు రజక సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సంఘం నాయకులు తెలిపారు. పట్టణ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై బోనాల మహోత్సవాలను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు వరంగంటి సదానందం, బూరుగుపల్లి రాము, మల్లికార్జున్, రాజేష్, శ్రీకాంత్తో పాటు సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు

## సత్తుపల్లి నియోజకవర్గంలో పర్యటించిన పిడమర్తి రవి

**సత్తుపల్లి,జులై27(తెలంగాణ ముచ్చట్లు ):** సత్తుపల్లి నియోజకవర్గంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి పర్యటించారు. ఈ సందర్భంగా బేతపల్లి గ్రామంలో చెన్నకేశవరావు కుటుంబాన్ని పరామర్శించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం తల్లాడలో దుగ్గుల రఘుపతి రెడ్డి దశదిన కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.తర్వాత తల్లాడలోని మట్టమ్మ హోటల్ యజమాని రాజుతో పలు సామాజిక, స్థానిక అంశాలపై చర్చించారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా నాయకులు, మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక







# రూ.600 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాలని హైడ్రాకు ఫిర్యాదు

- **ప్రజావాణిలో 42 వినతులు.. సంబంధిత అధికారులకు ఆదేశాలు**

**హైదరాబాద్, జులై 27 (తెలంగాణ ముచ్చట్లు):** కూకట్‌పల్లి-మూసాపేట గ్రామాల మధ్య ఉన్న సుమారు రూ.600 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుంచి కాపాడాలని మూసాపేట ప్రాంత నివాసితులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 42 ఫిర్యాదులు అందగా, వాటిని హైడ్రా అదనపు కమిషనర్ డి. ఆనంద్ కుమార్ పరిశీలించి సంబంధిత అధికారులకు పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి-మూసాపేట గ్రామాల మధ్య 10.18 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, అందులో నాలుగు ఎకరాలను మంచినీటి శుద్ధి కేంద్రం కోసం, మరో రెండు ఎకరాలను ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణం కోసం కేటాయించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. భవనాల నిర్మాణం చేపట్టకపోవడంతో మిగిలిన ప్రభుత్వ భూమితో పాటు మొత్తం 6.18 ఎకరాలపై పలు సంస్థలు షెడ్లు నిర్మించి ఆక్రమణలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. వెంటనే ఆ భూమిని స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు.

దుండిగల్ గ్రామంలోని సర్వే నంబర్ 419లో రెడీమిక్స్ ప్లాంట్ నిర్వహణ వల్ల పాఠశాలలు, నివాస ప్రాంతాల్లో తీవ్ర వాయు, శబ్ద కాలుష్యం ఏర్పడుతోందని మరో ఫిర్యాదు అందింది.

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూరు గ్రామంలోని సర్వే నంబర్లు 215 నుంచి 224 వరకు ఉన్న సుమారు 100 ఎకరాల భూదాన్, ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు జరుగుతున్నాయని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి లేదా ప్రభుత్వానికైనా భూమి దక్కేలా హైడ్రా జోక్యం చేసుకుని భూములను పరిరక్షించాలని కోరారు.

సంగారెడ్డి జిల్లా కొల్లూరు గ్రామంలోని భవానీనగర్ లేఅవుట్‌లో రహదారులు, పార్కుల కోసం కేటాయించిన స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయని ప్లాటు యజమానులు ఫిర్యాదు చేశారు. లేఅవుట్‌ను పరిరక్షించి ప్రజా స్థలాలను తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.సరూర్‌నగర్ మండలం మన్సూరాబాద్‌లో హౌసింగ్ కార్పొరేషన్ లేఅవుట్‌లో ప్రజా అవసరాల కోసం కేటాయించిన ఓపెన్ స్పేస్‌లో అక్రమ నిర్మాణాలు చేపట్టారని స్థానికులు ఫిర్యాదు చేశారు. ప్రజా స్థలాన్ని ఆక్రమణల నుంచి విముక్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

మహేశ్వరం మండలం సర్దార్‌నగర్ పరిధిలోని పెద్ద చెరువు సమీపంలో ఎఫ్‌టీఎల్ పరిధిలో లేని భూముల్లో కృత్రిమంగా నీరు నిల్వ చేసి భూయజమానులు తమ స్థలాలకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారని బాధితులు ఫిర్యాదు చేశారు. సమస్యను పరిశీలించి పరిష్కరించాలని కోరారు.

నార్సింగి సర్కిల్ పరిధిలోని అరుణోదయ సొసైటీ హుడా లేఅవుట్‌లో పార్కుల కోసం కేటాయించిన 14,231 చదరపు గజాల స్థలాన్ని అక్రమంగా ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. అక్రమ రిజిస్ట్రేషన్లు, అనుమతులను రద్దు చేసి పార్కుల స్థలాలను పరిరక్షించాలని హైడ్రాను కోరారు.

ప్రజావాణిలో అందిన అన్ని ఫిర్యాదులను పరిశీలించిన హైడ్రా అదనపు కమిషనర్ డి. ఆనంద్ కుమార్, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.





# ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి సాగునీటి విడుదల

- **రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం..**
- **రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యం**
- **ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, కడియం శ్రీహరి**

**హనుమకొండ, జులై 27 (తెలంగాణ ముచ్చట్లు):** ధర్మసాగర్ రిజర్వాయర్ సౌత్ కెనాల్ నుంచి సోమవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కలిసి సాగునీటిని విడుదల చేశారు. గోదావరి జలాలకు పసుపు, కుంకుమ, పుష్పాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి కాలువ గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ, రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. ఎల్‌నీనో ప్రభావంతో తగిన వర్షాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఉపశమనం కలిగించేందుకే ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి సాగునీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గంలోని హసన్‌పర్తి, ఐనవోలు, వర్ధన్నపేట మండలాల పరిధిలోని వేలాది ఎకరాలకు ఈ నీటితో ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. ప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు.

స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ, సాగునీరు రైతులకు జీవనాధారమని అన్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా అవసరమైన సమయంలో నీటిని అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ధర్మసాగర్ రిజర్వాయర్‌లో ఉన్న నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకుని నీటిని విడుదల చేస్తున్నామని, వర్షాలు సమృద్ధిగా కురిస్తే రైతులకు నిరంతరాయంగా సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాలువ ఆయకట్టు పరిధిలోని రైతులకు సాగునీటి సమస్యను తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, మాజీ జడ్పీటీసీ బానోత్ సింగులాల్, కాంగ్రెస్ పార్టీ ధర్మసాగర్ మండల అధ్యక్షులు పెసరు రమేష్, ధర్మసాగర్ సర్పంచ్ మాచర్ల జ్యోతి ,డివిజన్ అధ్యక్షులు హరీష్ రెడ్డి, సదానందం, శ్రీకాంత్, ఐనవోలు సర్పంచుల ఫోరం అధ్యక్షుడు శంకర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బుచ్చిరెడ్డి, ఏనుమాముల మార్కెట్ డైరెక్టర్ రైతు రాజు, విసం సురేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాకేష్ రెడ్డి, దువ్వ నవీన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# తిరుపతిలో తొలి కరోనా కేసు




- **రాష్ట్రంలో 49కు చేరిన కేసులు**
- **ఆసుపత్రుల్లో 24 మందికి చికిత్స**
- **అప్రమత్తమైన వైద్యారోగ్య శాఖ**

**అమరావతి, జూలై 27 (తెలంగాణ ముచ్చట్లు):** ఆంధ్రప్రదేశ్‌లో కరోనా వైరస్ వ్యాప్తి మరోసారి ఆందోళన కలిగిస్తోంది. తాజాగా తిరుపతిలో తొలి కరోనా కేసు నమోదైంది. తిరుపతి అర్బన్ ప్రాంతానికి చెందిన 65 ఏళ్ల వృద్ధురాలికి కరోనా వైరస్ నిర్ధారణ కావడంతో జిల్లా వైద్య యంత్రాంగం అప్రమత్తమైంది. గత కొన్ని రోజులుగా శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు జిల్లా ఆసుపత్రికి తరలించగా, జూలై 23న నిర్వహించిన పరీక్షల్లో కరోనా సోకినట్లు నిర్ధారణ అయింది. వృద్ధురాలికి కరోనా నిర్ధారణ అయిన వెంటనే వైద్యులు అవసరమైన చికిత్స అందిస్తున్నారు. ఆమెతో సన్నిహితంగా ఉన్న కుటుంబ సభ్యులకు కూడా వైద్య బృందాలు పరీక్షలు నిర్వహించగా, వారిలో ఎవరికి వైరస్ సోకినట్లు గుర్తించలేదని వైద్యారోగ్య శాఖ వెల్లడించింది. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా కూడా కరోనా కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. శనివారం ఒక్కరోజే పది మందికి పైగా కొత్తగా వైరస్ బారిన పడినట్లు వైద్యారోగ్య శాఖ వెల్లడించింది. దీంతో రాష్ట్రంలో మొత్తం కరోనా కేసుల సంఖ్య 49కు చేరింది. ప్రస్తుతం 24 మంది వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో కొత్త కేసులు నమోదుకాగా, కృష్ణా, తిరుపతి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఒక్కో కేసు వెలుగుచూసింది. జిల్లాల వారీగా పరిస్థితిని అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. అవసరమైన చోట్ల వైద్య సేవలను మరింత బలోపేతం చేయడంతో పాటు పర్యవేక్షణను కూడా పెంచారు.

ఇప్పటివరకు రాష్ట్రంలో కరోనా కారణంగా నలుగురు మరణించినట్లు వైద్యశాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఆసుపత్రుల్లో అవసరమైన వైద్య సదుపాయాలు, ఔషధాల నిల్వలు, పరీక్షల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు అధికారులు తెలిపారు. ప్రజల్లో అనవసర భయాందోళనలు అవసరం లేదని, లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కరోనా వ్యాప్తిని నియంత్రించేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలను మరింత వేగవంతం చేసింది. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, జ్వరం, దగ్గు, శ్వాస సంబంధిత సమస్యలు ఉంటే పరీక్షలు చేయించుకోవడం, అవసరమైన సందర్భాల్లో మాస్కు ధరించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు కొనసాగిస్తామని వైద్యారోగ్య శాఖ వెల్లడించింది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# గ్లామర్‌కు గుడ్‌బై.. ఇక యాక్షన్ రోల్స్ మాత్రమే: మాళవిక మోహనన్



నటి మాళవిక మోహనన్ తన కెరీర్‌కు సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇకపై గ్లామర్ పాత్రల కంటే నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలు, యాక్షన్ సినిమాలపైనే దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. అలాగే సినీ పరిశ్రమలో మహిళా దర్శకుల సంఖ్య పెరగాలని, సినిమాల్లో మహిళల దృక్కోణానికి మరింత ప్రాధాన్యం దక్కాలని అభిప్రాయపడ్డారు. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన మాళవిక.. స్కిన్ షో కంటే తన నటనతోనే ప్రేక్షకుల గుర్తింపు పొందాలని కోరుకుంటున్నానని తెలిపారు. భవిష్యత్తులో గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటూ, బలమైన కథలతో కూడిన పాత్రల్లో నటించాలనేది తన లక్ష్యమని చెప్పారు. టాలీవుడ్‌లో 'ది రాజా సాబ్' చిత్రంతో అడుగుపెట్టిన మాళవిక మోహనన్, ప్రస్తుతం యాక్షన్ ఎంటర్‌టైనర్‌లపై ఆసక్తి చూపుతున్నట్లు వెల్లడించారు. 'కిల్ బిల్' తరహా యాక్షన్ పాత్రలో నటించడం తన కల అని చెప్పారు. అలాగే 'లాపతా లేడీస్' సినిమా తనను ఎంతో ఆకట్టుకుందని, ఇలాంటి విభిన్న కథలకు ప్రేక్షకుల ఆదరణ పెరగడం సంతోషకరమని అన్నారు. 2013లో మలయాళ చిత్రం **'పట్టం పోలే'**తో సినీ రంగ ప్రవేశం చేసిన మాళవిక, తర్వాత 'పెట్టా' సినిమాతో తమిళ ప్రేక్షకులకు చేరువయ్యారు. అనంతరం ధనుష్, విజయ్ దళపతి వంటి స్టార్ హీరోలతో నటిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. గ్లామర్ కంటే నటనకు ప్రాధాన్యం ఇస్తూ, యాక్షన్ ప్రధాన పాత్రల్లో కనిపించాలన్న మాళవిక మోహనన్ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అభిమానులు కూడా ఆమె కొత్త నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారు.

# ఇషా సింగ్ స్వర్ణ విజయం

(మొదటి పేజీ తరువాయి)




తెలంగాణకు చెందిన ఇషా సింగ్ సాధించిన విజయం రాష్ట్రానికి ప్రత్యేక గౌరవాన్ని తీసుకొచ్చిందని ముఖ్యమంత్రి తెలిపారు. క్రీడల పట్ల ఆమె చూపిన అంకితభావం, కఠోర సాధన యువ క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు వరుస విజయాలు సాధించడం ఆనందదాయకమని అన్నారు. మహిళా క్రీడాకారులు తమ ప్రతిభతో ప్రపంచ స్థాయిలో రాణిస్తూ దేశ ప్రతిష్ఠను పెంచుతున్నారని ముఖ్యమంత్రి కొనియాడారు. వారి విజయాలు యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడమే కాకుండా, క్రమశిక్షణ, పట్టుదలతో లక్ష్యాలను సాధించవచ్చనే సందేశాన్ని ఇస్తున్నాయని పేర్కొన్నారు.

ఇషా సింగ్, మను బాకర్ భవిష్యత్తులో కూడా మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో విజయాలు సాధించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ప్రపంచ వేదికపై భారత జెండాను మరింత ఎత్తుకు తీసుకెళ్లేలా ఇద్దరూ తమ ప్రతిభను కొనసాగించాలని శుభాకాంక్షలు తెలిపారు. దేశ కీర్తి ప్రతిష్ఠలను మరింత ఉన్నత స్థాయికి చేర్చాలని ఆశాభావం వ్యక్తం చేశారు. హ్యాంగ్‌ఝౌలో జరుగుతున్న ప్రపంచకప్ పోటీల్లో భారత షూటర్లు కనబరుస్తున్న ప్రతిభ దేశ క్రీడా రంగానికి కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. అంతర్జాతీయ స్థాయిలో భారత క్రీడాకారులు సాధిస్తున్న విజయాలకు దేశవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విజయాలు భవిష్యత్ తరాల క్రీడాకారులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.






## ఈషా, మనుకు అమిత్ షా అభినందనలు

- ప్రపంచకప్‌లో భారత్‌కు స్వర్ణ విజయం
- మహిళల పిస్టల్ విభాగంలో పతకాల పంట
- భారత క్రీడా స్ఫూర్తికి ప్రశంసలు

న్యూఢిల్లీ, జూలై 27 (తెలంగాణ ముచ్చట్లు):

అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య ప్రపంచకప్-2026 మహిళల 25 మీటర్ల పిస్టల్ విభాగంలో భారత షూటర్లు ఈషా సింగ్ స్వర్ణ పతకం, మను భాకర్ కాంస్య పతకం సాధించడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా అభినందనలు తెలిపారు. ఇద్దరూ అసాధారణ ప్రతిభ, ధైర్యసాహసాలతో భారత కీర్తిని ప్రపంచ వేదికపై మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లారని కొనియాడారు. ఈషా సింగ్ పోటీలో అద్భుతమైన ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకోగా, మను భాకర్ కాంస్య పతకాన్ని గెలుచుకుని మరోసారి తన ప్రతిభను చాటుకుంది. అత్యంత ఒత్తిడిలోనూ లక్ష్యంపై పూర్తి ఏకాగ్రతతో గురి తప్పకుండా ప్రదర్శన ఇవ్వడం వారి నైపుణ్యానికి నిదర్శనమని అమిత్ షా పేర్కొన్నారు. ఈ విజయాలు భారత షూటింగ్ రంగం అంతర్జాతీయ స్థాయిలో సాధిస్తున్న పురోగతికి ప్రతీకగా నిలుస్తున్నాయని ఆయన అన్నారు. యువ క్రీడాకారులకు ఈషా సింగ్, మను భాకర్ ఆదర్శంగా నిలుస్తున్నారని, క్రమశిక్షణ, నిరంతర సాధనతో ప్రపంచస్థాయి విజయాలు సాధించవచ్చని వారి ప్రదర్శన నిరూపించిందని అభిప్రాయపడ్డారు.

ప్రపంచకప్ వేదికపై ఒకే విభాగంలో భారత క్రీడాకారిణులు స్వర్ణ, కాంస్య పతకాలు గెలవడం దేశానికి గర్వకారణమని అమిత్ షా పేర్కొన్నారు. ఈ విజయం భారత క్రీడా రంగానికి మరింత ఉత్సాహాన్ని నింపుతుందని, భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో ఇదే స్ఫూర్తితో రాణించాలని ఆకాంక్షించారు. ఇటీవలి కాలంలో భారత షూటర్లు ప్రపంచస్థాయిలో వరుస విజయాలు నమోదు చేస్తూ దేశానికి పతకాల వర్షం కురిపిస్తున్నారు. ఈ విజయాల వెనుక క్రీడాకారుల కఠోర శ్రమతో పాటు శిక్షకులు, క్రీడా సంస్థల కృషి కూడా ఎంతో ఉందని క్రీడా విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈషా సింగ్, మను భాకర్ సాధించిన ఈ ఘన విజయంతో భారత త్రివర్ణ పతాకం మరోసారి ప్రపంచ వేదికపై రెపరెపలాడింది. దేశవ్యాప్తంగా క్రీడాభిమానులు, ప్రముఖులు ఇద్దరికీ శుభాకాంక్షలు తెలుపుతూ, భవిష్యత్తులో ఒలింపిక్స్ సహా మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో కూడా పతకాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించిన సీతక్క

- ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- వైద్యులతో చికిత్సపై సమీక్ష
- ప్రభుత్వ సహకారం ఉంటుందని హామీ

హైదరాబాద్, జూలై 27 (తెలంగాణ ముచ్చట్లు):



మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో పాటు వైద్యులు, కుటుంబ సభ్యులతో మాట్లాడి చికిత్స పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పెద్ది సుదర్శన్ రెడ్డికి అందిస్తున్న వైద్య సేవల గురించి వైద్య బృందాన్ని మంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో, చికిత్సకు శరీరం ఎలా స్పందిస్తోందో వివరాలను పరిశీలించారు. అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచి అత్యుత్తమ చికిత్స కొనసాగించాలని వైద్యులను కోరారు. చికిత్సలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన ప్రత్యేక వైద్య సేవలను కూడా అందించాలని వైద్య బృందానికి తెలిపారు. రోగి త్వరగా కోలుకునేలా అన్ని చర్యలు చేపట్టాలని కోరారు.

ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మంత్రి కొంతసేపు మాట్లాడారు. ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, చికిత్సకు సంబంధించిన ప్రతి అంశంలో ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అవసరమైన సహాయం ఏదైనా ఉంటే వెంటనే అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా కోలుకుని మళ్లీ సాధారణ జీవితంలోకి రావాలని మంత్రి ఆకాంక్షించారు. సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజల మధ్యకు రావాలని కోరుకుంటూ ఆయన త్వరితగతిన కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అనారోగ్యానికి గురైన ప్రజాప్రతినిధులు, ప్రజా సేవకుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని మంత్రి పేర్కొన్నారు. అవసరమైన సమయంలో వారికి మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యం త్వరలోనే మెరుగుపడుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# కేసీఆర్ పరామర్శ.. ధైర్యం నింపిన భరోసా

- పెద్ది ఆరోగ్యంపై కేసీఆర్ ఆరా
- యశోద ఆస్పత్రిలో కుటుంబానికి భరోసా
- అత్యున్నత వైద్య చికిత్సపై సమీక్ష
- అండగా ఉంటామని బీఆర్ఎస్ అధినేత హామీ

హైదరాబాద్, జూలై 27 (తెలంగాణ ముచ్చట్లు):





బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పార్టీ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యులతో విస్తృతంగా మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితి, ఇప్పటి వరకు అందించిన వైద్య చికిత్స, తదుపరి చేపట్టనున్న వైద్య విధానాలపై సుదీర్ఘంగా వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను కలిసి వారికి మనోధైర్యం కల్పిస్తూ ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆస్పత్రిలోని అత్యవసర చికిత్స విభాగానికి వెళ్లిన కేసీఆర్ దాదాపు నలభై ఐదు నిమిషాల పాటు అక్కడే ఉండి వైద్య బృందంతో చర్చించారు. పెద్ది సుదర్శన్ రెడ్డికి అందిస్తున్న చికిత్సలో ప్రతి అంశాన్ని తెలుసుకుంటూ, అవసరమైన అన్ని వైద్య సదుపాయాలను అందించాలని వైద్యులను కోరారు. ఎలాంటి పరిస్థితి ఎదురైనా అత్యుత్తమ వైద్య సేవలు అందించడంలో రాజీ పడొద్దని సూచించారు. రోగి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు కుటుంబ సభ్యులకు తెలియజేస్తూ పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని కూడా వైద్యులకు సూచించినట్లు సమాచారం.

ఈ సందర్భంగా వైద్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై కేసీఆర్‌కు సమగ్రంగా వివరించారు. గుండె, ఊపిరితిత్తులు, ఇతర కీలక అవయవాలు సక్రమంగానే పనిచేస్తున్నాయని, అయితే మెదడు పూర్తిస్థాయిలో స్పందించేందుకు మరికొంత సమయం అవసరమని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అత్యాధునిక వైద్య పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ చికిత్స కొనసాగిస్తున్నామని చెప్పారు. పరిస్థితిని పూర్తిగా అంచనా వేయడానికి మరో 48 గంటలు కీలకమయ్యే అవకాశం ఉందని వైద్యులు వివరించారు. పెద్ది సుదర్శన్ రెడ్డికి ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందిస్తున్నామని, అవసరమైతే విదేశాల్లోని నిపుణులతో కూడా సంప్రదింపులు కొనసాగిస్తున్నామని వైద్యులు వెల్లడించారు. అమెరికా సహా పలు దేశాలకు చెందిన వైద్య నిపుణుల సూచనలను పరిగణనలోకి తీసుకుంటూ చికిత్స కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఎంఆర్ఐతో పాటు అవసరమైన అన్ని వైద్య పరీక్షలను నిరంతరం నిర్వహిస్తూ, సీనియర్ వైద్యుల బృందం సమీక్షల ఆధారంగా తదుపరి చికిత్స నిర్ణయాలు తీసుకుంటున్నట్లు వివరించారు.

వైద్యుల నుంచి వివరాలు తెలుసుకున్న అనంతరం కేసీఆర్ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి వారికి ధైర్యం చెప్పారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వైద్యులు తమ వంతు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. దేవుడి దయ, వైద్యుల నిబద్ధత, ప్రజల ఆశీస్సులతో ఆయన ఆరోగ్యం మెరుగుపడుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కష్టకాలంలో ధైర్యం కోల్పోవద్దని కుటుంబ సభ్యులకు సూచిస్తూ, ఎలాంటి పరిస్థితిలోనూ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. చికిత్స కోసం అవసరమయ్యే ఖర్చు విషయంలో ఏమాత్రం వెనకాడబోమని కేసీఆర్ స్పష్టం చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డిని కోలుకునేలా చేయడానికి పార్టీ తరఫున అన్ని విధాలా సహకారం అందిస్తామని తెలిపారు. వైద్యులకు కూడా అవసరమైన ఏ వనరు కావాలన్నా అందుబాటులో ఉంచుతామని, ప్రాణాలను కాపాడేందుకు శాయశక్తులా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. రోగి ఆరోగ్య పరిస్థితిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని పేర్కొన్నారు.


యశోద ఆస్పత్రి వైద్యులు కూడా తమ శక్తి వంచన లేకుండా చికిత్స అందిస్తున్నామని కేసీఆర్‌కు హామీ ఇచ్చారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి, ఎండీ ఏఎస్ రావు వైద్య సేవల పురోగతిని వివరించారు. అత్యున్నత ప్రమాణాలతో చికిత్స కొనసాగుతోందని, ప్రతి క్షణం ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తూ అవసరమైన నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డి భార్య స్వప్న, కుమారుడు నిదర్శన్ రెడ్డి, కుమార్తె ధర్మిష్ట, కుటుంబ సభ్యులతో కేసీఆర్ ప్రత్యేకంగా మాట్లాడారు. వారికి మనోధైర్యం కల్పిస్తూ ఏ అవసరం వచ్చినా పార్టీ తరఫున వెంటనే స్పందిస్తామని హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులు కూడా వైద్యులు అందిస్తున్న సేవలపై విశ్వాసం వ్యక్తం చేశారు.

కేసీఆర్ వెంట మాజీ మంత్రులు హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, రాజయ్య, వేముల ప్రశాంత్ రెడ్డి, సత్యవతి రాథోడ్, పద్మారావు గౌడ్, వినోద్ కుమార్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ సంజయ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా కోలుకుని ప్రజా జీవితంలోకి తిరిగి రావాలని వారు ఆకాంక్షించారు.

# మెట్రో సేవల మెరుగుదలకు చర్యలు

- ప్రయాణికుల సౌకర్యాలపై క్షేత్రస్థాయి పరిశీలన
- పది స్టేషన్ల అభివృద్ధికి కార్యాచరణ
- అదనపు ఎండీ అజిత్ రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్, జూలై 27 (తెలంగాణ ముచ్చట్లు):



మెట్రో ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బేగంపేట్ నుంచి రాయదుర్గం వరకు మెట్రోలో ప్రయాణిస్తూ బేగంపేట్, అమీర్‌పేట్, రాయదుర్గం స్టేషన్లలోని వేదికలు, ప్రయాణికుల విభాగాలు, వీధి మట్టంలోని సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహణ బాధ్యతలు నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులతో మాట్లాడి ప్రయాణికులకు అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. స్టేషన్ల వద్ద వీధి మట్టంలోని వాహన నిలిపే ప్రదేశాలను మరింత సమర్థంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బేగంపేట్, అమీర్‌పేట్, రాయదుర్గం స్టేషన్లలోని పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించి అవసరమైన మార్పులు చేయాలని అధికారులకు సూచించారు. స్టేషన్ల పరిసరాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణపై కూడా సమీక్ష నిర్వహించారు.

మెట్రో స్తంభాల మధ్యనున్న మధ్య విభాగాల నిర్వహణలో మరింత మెరుగుదల అవసరమని అజిత్ రెడ్డి పేర్కొన్నారు. సంబంధిత నిర్వహణ సంస్థల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ పరిశుభ్రత, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పనులు చేపట్టాలని ఆదేశించారు. రాయదుర్గం మెట్రో స్టేషన్ వద్ద ఆకాశ మార్గం, సమాచార సాంకేతిక సంస్థలకు అనుసంధాన మార్గాలు, మైండ్‌స్పేస్ కూడలి వద్ద ప్రయాణికుల రాకపోకలను పరిశీలించారు. రద్దీ సమయాల్లో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా మరింత క్రమబద్ధమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్టేషన్ల కింద ఉన్న వాణిజ్య ప్రదేశాల నిర్వహణపై కూడా సమీక్ష నిర్వహించారు.

ప్రయాణికుల సౌకర్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొంటూ ప్రతి స్టేషన్‌కు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తొలి దశలో పది మెట్రో స్టేషన్లను ఎంపిక చేసి అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. మిగిలిన స్టేషన్లను కూడా దశలవారీగా పరిశీలించి సౌకర్యాలను మరింత మెరుగుపరుస్తామని వెల్లడించారు. ఈ పరిశీలనలో హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ ప్రధాన ఇంజనీర్ వై. సాయపా రెడ్డి, కార్యనిర్వాహక ఇంజనీర్ కె. శ్యామ్ మోహన్, భద్రత విభాగం ప్రధాన నిర్వాహకుడు శ్రీనాథ్ రెడ్డి, ఉప పోలీసు అధికారులు జగన్నాథ్ రెడ్డి, శివరామిరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు. ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్ రెడ్డి సూచించారు.

# తెలంగాణ రక్షణ సేన విస్తరణ

- మరో 19 స్థానాలకు ఇన్‌ఛార్జీల నియామకం
- బీసీలకు అధిక ప్రాధాన్యం
- లోక్‌సభ, అనుబంధ విభాగాలకు బాధ్యతలు

హైదరాబాద్, జూలై 27 (తెలంగాణ ముచ్చట్లు):



తెలంగాణ రక్షణ సేన సంస్థాగత విస్తరణలో భాగంగా మరో 19 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జీలను నియమిస్తూ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రెండో విడత జాబితాను విడుదల చేశారు. ఇప్పటికే 23 అసెంబ్లీ నియోజకవర్గాలకు బాధ్యతలు అప్పగించిన అనంతరం రెండో విడతలో కొత్త నియామకాలు చేపట్టారు. అదే విధంగా తొమ్మిది లోక్‌సభ నియోజకవర్గాలకు కూడా ఇన్‌ఛార్జీలను నియమిస్తూ సంస్థాగత బలోపేతానికి చర్యలు తీసుకున్నారు. రెండో విడత నియామకాలలో వెనుకబడిన తరగతులకు అధిక ప్రాధాన్యం కల్పించారు. మొత్తం 19 అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలలో 10 మంది వెనుకబడిన తరగతుల నాయకులకు అవకాశం కల్పించినట్లు పార్టీ ప్రకటించింది. అన్ని వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు సామాజిక సమతుల్యతను దృష్టిలో ఉంచుకుని నియామకాలు చేపట్టినట్లు వెల్లడించింది. పార్టీ అనుబంధ విభాగాలకు కూడా రాష్ట్ర స్థాయి బాధ్యతలను ప్రకటించారు. మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా పడాల మనోజ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా కనగల చైతన్య, ఉపాధ్యక్షురాలిగా అయిలి కవితను నియమించారు. విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా జానపాటి రాము యాదవ్, ప్రధాన కార్యదర్శిగా మునుకుంట్ల నవీన్ గౌడ్, ఉపాధ్యక్షురాలిగా చింతలపాటి రాధశ్రీకి బాధ్యతలు అప్పగించారు.

బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా అల్లంపల్లి రామకోటి, ప్రధాన కార్యదర్శిగా గొరిగె నర్సింహా, ఉపాధ్యక్షులుగా కుసుమ రజిత, ఈదులకంటి శైలజ గౌడ్‌ను నియమించారు. పార్టీ బలోపేతంతో పాటు వివిధ సామాజిక వర్గాలకు ప్రాధాన్యం కల్పించే లక్ష్యంతో ఈ నియామకాలు చేపట్టినట్లు పార్టీ పేర్కొంది. జిల్లా స్థాయి సంస్థాగత నిర్మాణాన్ని కూడా మరింత పటిష్ఠం చేసే దిశగా గ్రేటర్ వరంగల్, సూర్యాపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు అధ్యక్షులను నియమించారు. గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా నడిపెల్లి వెంకటేశ్వరరావు, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా కుందూరు దేవేందర్ రెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షురాలిగా సుమలత సుధాకర్ శర్మకు బాధ్యతలు అప్పగించారు.

ఈ నియామకాలతో పార్టీ సంస్థాగత నిర్మాణం మరింత బలోపేతం అవుతుందని నాయకత్వం అభిప్రాయపడింది. అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల స్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తరించడం, ప్రజా సమస్యలపై ఉద్యమాలను మరింత వేగవంతం చేయడం, గ్రామస్థాయి వరకు పార్టీని బలోపేతం చేయడమే ఈ నియామకాల ప్రధాన ఉద్దేశమని పార్టీ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# సీఆర్‌పీఎఫ్‌కు ప్రధాని అభినందనలు

- స్థాపన దినోత్సవ వేడుకలు
- అంతర్గత భద్రతలో కీలక పాత్ర
- మావోయిస్టు వ్యతిరేక పోరులో ప్రశంసలు

**న్యూఢిల్లీ, జూలై 27 (తెలంగాణ ముచ్చట్లు):**

కేంద్ర రిజర్వు పోలీసు దళం స్థాపన దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా ఉన్న సీఆర్‌పీఎఫ్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. విధి నిర్వహణలో చూపుతున్న అచంచల ధైర్యసాహసాలు, అంకితభావం, దేశ సేవ పట్ల నిబద్ధత సీఆర్‌పీఎఫ్‌ను దేశంలోని అత్యంత విశ్వసనీయ భద్రతా బలగాల్లో ఒకటిగా నిలబెట్టాయని పేర్కొన్నారు. దేశ అంతర్గత భద్రతను పరిరక్షించడంలో సీఆర్‌పీఎఫ్ పోషిస్తున్న పాత్ర ఎంతో కీలకమని ప్రధాని అన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలవడంతో పాటు శాంతి భద్రతలను కాపాడడంలో ఈ బలగం నిరంతరం ముందుంటోందని కొనియాడారు. ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర పరిస్థితుల్లో కూడా ప్రజలకు సేవలు అందిస్తూ విశేష



కృషి చేస్తోందని పేర్కొన్నారు.

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో శాంతి, అభివృద్ధి సాధన కోసం సీఆర్‌పీఎఫ్ సిబ్బంది చేస్తున్న సేవలు ప్రశంసనీయమని మోదీ అన్నారు. దేశ సమగ్రత, భద్రత కోసం వారు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. వారి త్యాగాలు, సేవలు దేశ ప్రజలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లోనూ అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శిస్తూ దేశ రక్షణలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారని ప్రధాని తెలిపారు. సరిహద్దు ప్రాంతాల నుంచి అంతర్గత భద్రత వరకు వివిధ రంగాల్లో వారి సేవలు దేశానికి ఎంతో విలువైనవని అన్నారు.

1939లో స్థాపించబడిన సీఆర్‌పీఎఫ్ ప్రస్తుతం దేశంలోనే అతిపెద్ద కేంద్ర సాయుధ పోలీసు బలగంగా సేవలందిస్తోంది. ఉగ్రవాద నిరోధక చర్యలు, మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్లు, ఎన్నికల భద్రత, విపత్తు పరిస్థితుల్లో సహాయక చర్యలు వంటి అనేక కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల విశ్వాసాన్ని చూరగొంటోంది. స్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా సీఆర్‌పీఎఫ్ శిబిరాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో విశేష ప్రతిభ కనబరిచిన సిబ్బందిని సత్కరించడంతో పాటు, దేశ భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను ఘనంగా స్మరించుకున్నారు.

# పారిశ్రామికాభివృద్ధిపై ప్రధాన కార్యదర్శి సమీక్ష

- ఈసిటీ, మంకాల్, మహేశ్వరం పరిశ్రమల సందర్శన
- పెట్టుబడులు, ఉపాధి అవకాశాలపై ఆరా
- పరిశ్రమలకు మరింత ప్రోత్సాహం కల్పిస్తామని హామీ

**హైదరాబాద్, జూలై 27 (తెలంగాణ ముచ్చట్లు):**




రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, తయారీ రంగ విస్తరణ, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన పురోగతిని సమీక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఈసిటీ ఎలక్ట్రానిక్ తయారీ క్లస్టర్, మంకాల్ పారిశ్రామికవాడ, మహేశ్వరం జనరల్ పార్క్‌లోని పలు పరిశ్రమలను సందర్శించారు. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ఉపాధ్యక్షుడు, మేనేజింగ్ డైరెక్టర్, ప్రభుత్వ కార్యదర్శి, సంస్థ కార్యనిర్వాహక సంచాలకుడు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు. మొదట ఈసిటీలోని ప్రీమియర్ ఎనర్జీస్ ఫొటోవోల్టాయిక్ సంస్థను సందర్శించిన ప్రధాన కార్యదర్శి అక్కడ ఏర్పాటు చేసిన అత్యాధునిక సౌర విద్యుత్ ఫలకాల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. 25 ఎకరాల్లో ఏర్పాటైన ఈ పరిశ్రమలో రూ.1,240 కోట్ల పెట్టుబడితో సుమారు 1,200 మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు వివరించారు. ఉత్పత్తి సామర్థ్యం, భవిష్యత్ విస్తరణ, తయారీ ప్రక్రియలపై ప్రధాన కార్యదర్శి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం నాలుగు ఎకరాల్లో ఏర్పాటు చేసిన అవాంటెల్ సంస్థను సందర్శించారు. రక్షణ రంగానికి అవసరమైన అత్యాధునిక ఎలక్ట్రానిక్ పరికరాలు, ఉపగ్రహ పేలోడ్ వ్యవస్థలు, భూతల నియంత్రణ మౌలిక సదుపాయాల తయారీలో ఈ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు వివరించారు. రూ.59.22 కోట్ల పెట్టుబడితో సుమారు 400 మందికి ఉపాధి కల్పిస్తున్న ఈ పరిశ్రమ పనితీరును ప్రధాన కార్యదర్శి సమీక్షించి, అధునాతన సాంకేతిక తయారీ రంగంలో తెలంగాణ ముందంజలో ఉండడం అభినందనీయమని పేర్కొన్నారు. మంకాల్ పారిశ్రామికవాడలో చిరిపాల్ పాలీ ఫిలిమ్స్ సంస్థను సందర్శించిన సంజయ్ జాజు ప్రత్యేక పారిశ్రామిక ఫిల్ముల తయారీ ప్రక్రియను పరిశీలించారు. ప్రారంభ దశతో పాటు విస్తరణ ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తిచేసి ప్రస్తుతం వాణిజ్య ఉత్పత్తి కొనసాగిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు వివరించారు. రూ.284.02 కోట్ల పెట్టుబడితో సుమారు 500 మందికి ఉపాధి కల్పిస్తున్న ఈ పరిశ్రమ రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి దోహదపడుతోందని ఆయన పేర్కొన్నారు.

మహేశ్వరం జనరల్ పార్క్‌లోని విప్రో ఎంటర్‌ప్రైజెస్ తయారీ కేంద్రాన్ని సందర్శించిన ప్రధాన కార్యదర్శి అక్కడి ఉత్పత్తి విభాగాలు, విస్తరణ పనులను పరిశీలించారు. 30 ఎకరాల్లో ఏర్పాటైన ఈ పరిశ్రమలో రూ.174.34 కోట్ల పెట్టుబడితో 331 మందికి ఉపాధి లభిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ తయారీ కేంద్రాన్ని సందర్శించి ఆధునిక తయారీ విధానాలను పరిశీలించారు. 3.7 ఎకరాల్లో ఏర్పాటైన ఈ పరిశ్రమలో రూ.374.05 కోట్ల పెట్టుబడితో 2,782 మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు వెల్లడించారు. పరిశ్రమల ప్రతినిధులతో సమావేశమైన ప్రధాన కార్యదర్శి పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారంపై చర్చించారు. పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం, ప్రపంచ స్థాయి పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులను మరింత ఆకర్షించడం, తయారీ రంగాన్ని బలోపేతం చేయడం, యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పరిశ్రమలు తెలంగాణ తయారీ రంగాన్ని బలోపేతం చేయడంలో, భారీ పెట్టుబడులను ఆకర్షించడంలో, వేలాది మందికి ఉపాధి కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని సంజయ్ జాజు అభినందించారు.

# భారత్–శ్రీలంక ఎన్నికల సహకారం

- ఎన్నికల నిర్వహణపై చర్చలు
- శిక్షణకు ప్రాధాన్యం
- సహకారం మరింత విస్తరణ

**న్యూఢిల్లీ, జూలై 27 (తెలంగాణ ముచ్చట్లు):**



భారత ప్రధాన ఎన్నికల కమిషనర్, అంతర్జాతీయ ప్రజాస్వామ్య, ఎన్నికల సహాయ సంస్థ సభ్య దేశాల మండలి అధ్యక్షుడు జ్ఞానేశ్ కుమార్ న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో భారత్‌లోని శ్రీలంక హై కమిషనర్ మహిషిణి కొలొన్నేతో సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య ఎన్నికల నిర్వహణ, శిక్షణ, పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై విస్తృతంగా చర్చించారు. భారత్, శ్రీలంక పొరుగు దేశాలుగా చారిత్రక, సాంస్కృతిక సంబంధాలతో పాటు ప్రజాస్వామ్య విలువలను పంచుకుంటున్నాయని సమావేశంలో ఇరు వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఉమ్మడి విలువలే ఎన్నికల వ్యవస్థల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించేందుకు బలమైన పునాదిగా నిలుస్తాయని అభిప్రాయపడ్డాయి.

అంతర్జాతీయ ప్రజాస్వామ్య, ఎన్నికల నిర్వహణ సదస్సు-2026లో రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేసేందుకు కలిసి పనిచేయాలని ఇరు పక్షాలు నిర్ణయించాయి. ఎన్నికల నిర్వహణలో అనుభవాల మార్పిడి, ఉత్తమ విధానాల అమలుపై కూడా చర్చించారు. ఎన్నికల అధికారులకు శిక్షణ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడంతో పాటు ఆధునిక ఎన్నికల నిర్వహణ పద్ధతులపై పరస్పర సహకారాన్ని విస్తరించేందుకు అంగీకరించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, సామర్థ్యాన్ని పెంపొందించే దిశగా సంయుక్త కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించారు.

స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సంస్థాగత సామర్థ్యాల పెంపు వంటి అంశాలపై ఇరు దేశాల ఎన్నికల సంస్థలు కలిసి పనిచేయనున్నాయి. పరస్పర అనుభవాల మార్పిడి ద్వారా ఎన్నికల వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సమావేశంలో అభిప్రాయపడినట్లు సమాచారం. భారత్ ఎన్నికల నిర్వహణలో ప్రపంచవ్యాప్తంగా సంపాదించిన అనుభవాన్ని ఇతర దేశాలతో పంచుకుంటున్న నేపథ్యంలో, శ్రీలంకతో ఈ సహకారం మరింత బలపడనుంది. ఇరు దేశాల ఎన్నికల సంస్థల మధ్య నిరంతర సమన్వయంతో ప్రజాస్వామ్య వ్యవస్థలను మరింత పటిష్ఠం చేయడానికి ఈ సమావేశం దోహదపడుతుందని అధికారులు తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరాలి

- ఐఐటీ, నీట్ లక్ష్యంగా కృషి చేయాలి
- మహేశ్వరం మోడల్ స్కూల్‌లో ప్రధాన కార్యదర్శి పర్యటన
- విద్యార్థులతో మమేకమైన సంజయ్ జాజు

**రంగారెడ్డి, జూలై 27 (తెలంగాణ ముచ్చట్లు):**



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా కష్టపడి చదివితే ఐఐటీ, నీట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించి ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. సోమవారం మహేశ్వరంలోని తెలంగాణ మోడల్ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యంతో మమేకమై విద్యా బోధన, పాఠశాల వాతావరణంపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు, సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడిన సంజయ్ జాజు, తరగతులు క్రమం తప్పకుండా జరుగుతున్నాయా, ఉపాధ్యాయులు సమర్థవంతంగా బోధిస్తున్నారా అనే అంశాలపై ఆరా తీశారు. విద్యార్థులు చదువుతో పాటు తమ భవిష్యత్ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకుని వాటి సాధన కోసం నిరంతరం శ్రమించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న అవకాశాలను పూర్తిగా వినియోగించుకుంటే అత్యున్నత విజయాలు సాధించడం సాధ్యమేనని చెప్పారు.

ముఖ్యమంత్రి కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివి రాష్ట్ర అత్యున్నత పదవిని అధిరోహించిన విషయాన్ని గుర్తుచేస్తూ, ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులు తమ సామర్థ్యాన్ని విశ్వసించి ముందుకు సాగాలని ఆయన ప్రోత్సహించారు. క్రమశిక్షణ, అంకితభావం, నిరంతర సాధనతో ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని విద్యార్థులకు వివరించారు. పలువురు విద్యార్థులను వ్యక్తిగతంగా పలకరించి వారి భవిష్యత్ ఆశయాల గురించి తెలుసుకుని అభినందించారు. తన విద్యార్థి దశలో ఒక ఉన్నతాధికారి పాఠశాలను సందర్శించడం తనలో సివిల్ సర్వీసుల పట్ల ఆసక్తిని పెంచిందని సంజయ్ జాజు గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో తాను కృషి చేసి భారత పరిపాలనా సేవలో చేరినట్లు తెలిపారు. విద్యార్థులు కూడా తమ జీవితంలో ఎదురయ్యే ప్రతి అవకాశాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.

ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన డిజిటల్ అభ్యాస వనరులను సద్వినియోగం చేసుకోవాలని ప్రధాన కార్యదర్శి విద్యార్థులకు సూచించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే ఐఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించే లక్ష్యంతో కష్టపడి చదవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులను నిరంతరం ప్రోత్సహిస్తూ, వారికి మార్గనిర్దేశం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈ. గోపితో సమావేశమైన సంజయ్ జాజు పాఠశాల మౌలిక వసతులు, అవసరాలు, ఎదురవుతున్న సమస్యలపై సమీక్ష నిర్వహించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాల ప్రాంగణంలో మొక్క నాటి, పరిశుభ్రతతో పాటు క్రమశిక్షణ, విద్యా ప్రమాణాలను కాపాడుతున్న ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి కృష్ణ ఆదిత్య, శశాంక్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఇల్లు కొనడానికి ఈపీఎఫ్ డబ్బులు వాడుతున్నారా?

- - ముందుగా ఈ నష్టాల గురించి తెలుసుకోండి

**న్యూఢిల్లీ, జూలై 27, (తెలంగాణ ముచ్చట్లు):**

ఉద్యోగుల భవిష్య నిధి ఖాతాలోని డబ్బు అత్యవసర పరిస్థితుల్లో ఎంతో ఉపయోగపడుతుంది. అనారోగ్యం, వివాహం, ఇల్లు నిర్మాణం లేదా కొనుగోలు వంటి అవసరాలకు ఈ నిధిని వినియోగించుకోవచ్చు. అయితే అవసరం లేకుండా తరచూ ఈపీఎఫ్ సొమ్మును ఉపసంహరించుకుంటే పదవీ విరమణ సమయానికి భారీ నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ప్రస్తుతం ఈపీఎఫ్‌పై వార్షికంగా 8.25 శాతం వడ్డీ లభిస్తోంది. ఒకవేళ ఖాతా నుంచి రూ.50 లక్షలు ఉపసంహరించుకుంటే, చక్రవడ్డీ ప్రయోజనం కోల్పోవడం వల్ల 20 ఏళ్ల తర్వాత పదవీ విరమణ సమయానికి సుమారు రూ.2.44 కోట్ల వరకు నష్టం సంభవించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.




అదే సమయంలో ఈపీఎఫ్ సొమ్మును తీసుకోకుండా, బ్యాంకు నుంచి 20 ఏళ్ల కాలపరిమితితో సుమారు 8 శాతం వడ్డీపై రూ.50 లక్షల గృహ రుణం తీసుకుంటే మొత్తం వడ్డీ భారం సుమారు రూ.50.37 లక్షల వరకు మాత్రమే ఉంటుంది. దీంతో ఈపీఎఫ్ నిధిని ఉపసంహరించుకోవడం కంటే గృహ రుణం తీసుకోవడం కొన్ని సందర్భాల్లో ప్రయోజనకరంగా ఉండవచ్చని విశ్లేషకులు సూచిస్తున్నారు.

రిటైర్మెంట్‌కు సమీపంలో ఉన్నవారు ఇల్లు కొనుగోలు కోసం ఈపీఎఫ్ నిధిని వినియోగించుకోవడం సమంజసమే కావచ్చు. అయితే కెరీర్ ప్రారంభ దశలో ఉన్నవారు లేదా తమ పదవీ విరమణ పొదుపు ప్రధానంగా ఈపీఎఫ్‌పైనే ఆధారపడి ఉంటే, ఆ నిధిని వీలైనంత వరకు తాకకుండా ఉంచడం మంచిదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఈపీఎఫ్‌పై లభించే 8.25 శాతం వడ్డీ పూర్తిగా పన్ను మినహాయింపుతో లభించడం మరో ప్రధాన ప్రయోజనం. ఇది ప్రస్తుతం అనేక గృహ రుణాల వడ్డీ రేట్ల కంటే ఎక్కువగా ఉండటంతో, దీర్ఘకాలంలో మంచి సంపదను సృష్టించే అవకాశాన్ని కల్పిస్తుంది.

అయితే గృహ కొనుగోలుకు డౌన్ పేమెంట్ కోసం నిధుల కొరత ఉన్నప్పుడు లేదా తక్కువ క్రెడిట్ స్కోర్ కారణంగా బ్యాంకు రుణం లభించని పరిస్థితుల్లో మాత్రమే ఈపీఎఫ్ నుంచి పాక్షికంగా నిధులు ఉపసంహరించుకోవడం సరైన నిర్ణయంగా భావిస్తున్నారు. సాధారణ పరిస్థితుల్లో ఈపీఎఫ్‌ను పదవీ విరమణ భద్రత కోసం ఉద్దేశించిన దీర్ఘకాలిక పొదుపుగానే పరిగణించాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

# 4 గంటల్లోనే గ్యాస్ సిలిండర్ డెలివరీ..

- ఇండియన్ ఆయిల్ కొత్త సేవ ప్రారంభం

**న్యూఢిల్లీ, జూలై 27 ( తెలంగాణ ముచ్చట్లు):**



ఎల్పీజీ వినియోగదారులకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (IOCL) శుభవార్త తెలిపింది. 'ఇండేన్ ఎక్స్‌ట్రాలైట్ నౌ' పేరుతో తేలికైన 10 కిలోల కాంపోజిట్ గ్యాస్ సిలిండర్‌ను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, బుక్ చేసిన నాలుగు గంటల్లోనే ఇంటికే సిలిండర్ డెలివరీ చేసే కొత్త సేవను ప్రారంభించింది.

సంప్రదాయ ఉక్కు సిలిండర్లతో పోలిస్తే ఈ 10 కిలోల కాంపోజిట్ సిలిండర్ బరువు తక్కువగా ఉండటంతో దాన్ని మోయడం, తరలించడం, వినియోగించడం మరింత సులభమని ఇండియన్ ఆయిల్ తెలిపింది. గృహ అవసరాలతో పాటు చిన్న వ్యాపారాల వినియోగానికి కూడా ఇది అనువుగా ఉంటుందని పేర్కొంది.

కొత్త సేవలో వినియోగదారులు తమకు అనుకూలమైన డెలివరీ సమయాన్ని ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. అలాగే డిజిటల్ విధానంలో సులభంగా గ్యాస్ బుక్ చేసుకునే సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో బుకింగ్ ప్రక్రియ మరింత వేగంగా, పారదర్శకంగా మారనుందని సంస్థ తెలిపింది.

ప్రస్తుతం ఈ సేవను పుణే, గురుగ్రామ్, ఇండోర్, కోయంబత్తూరు నగరాల్లో ప్రారంభించారు. వినియోగదారుల స్పందనను బట్టి త్వరలో దేశంలోని మరిన్ని నగరాలకు ఈ సేవను విస్తరించనున్నట్లు ఇండియన్ ఆయిల్ వెల్లడించింది.

అలాగే, చిన్న కుటుంబాలు, విద్యార్థులు, చిరు వ్యాపారులు ఎక్కువగా వినియోగించే 5 కిలోల 'ఇండేన్ చోటూ' సిలిండర్‌కు కూడా నాలుగు గంటల్లో డెలివరీ సేవను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సంస్థ ప్రకటించింది. దీంతో వినియోగదారులు మరింత వేగంగా గ్యాస్ సిలిండర్ సేవలను పొందే అవకాశం కలగనుంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in